
రన్ ఫర్ ది హైలాండ్స్
MVS
PUBLICATIONS
మధుబాబు

# రన్ ఫర్ ది హైలాండ్స్

(షాడో స్పై ఎడ్వెంచర్)


రచన:

మధుబాబు

*© Author*
*© Madhu Baabu*
*This digital book is published by -*
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# రన్ ఫర్ ది హైలాండ్స్

"భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతున్నదని ఎవరైనా చెబితే పొరపాటున కూడా నమ్మబోకు. భూమి తిరిగేది సూర్యుడి చుట్టూ కాదు. రూపాయి నోటు చుట్టూ" అన్నాడు మార్వాడీ రాంలాల్ సేట్.

వినయంగా తలవూపాడు అతని కొడుకు.

"మనిషి డబ్బును సంపాదిస్తాడనేది వట్టిమాట. డబ్బును సంపాదించేది డబ్బే" మరింత వుత్సాహంగా కంటిన్యూ చేశాడు రాంలాల్.

ఆరోజు ఎందుకో ఎన్నడూ లేనంత సంతోషంగా వున్నాడతను. ఒకపట్టాన తన ఉపన్యాసాన్ని విరమించేటట్లు కనిపించటం లేదు. ఏం చేస్తే ఆ చిత్రహింసల నుంచి విముక్తి లభిస్తుందో ఆలోచిస్తూ తన్నుకొంటూ వస్తున్న ఆవలింతల్ని అతి ప్రయత్నంమీద అణచుకొని ఇంకా వినయంగా తలవూపాడు అతని కొడుకు.

అతని బాధల్ని భగవంతుడు పరికించాడు కాబోలు. రాంలాల్ ఉపన్యాసానికి వెంటనే కలిగింది అంతరాయం. బక్కచిక్కిన భగల్‌పూర్ పౌరుడు ఒకతను అడుగులో అడుగు వేసుకొంటూ దుకాణంలోకి వచ్చి రాంలాల్‌కి నమస్కారం చేశాడు.

"ఎవరు నువ్వు? ఏం కావాలి?" చిరాకుగా అడిగాడు రాంలాల్.

"నన్ను జోసఫ్ అంటారు సాబ్! నా కూతురి పెళ్ళి. మిమ్మల్ని కొంచెం డబ్బు అడిగాను..." చేతులు నులుముకుంటూ దీనంగా అన్నాడా పౌరుడు.

"ఓ! నువ్వా జోసఫూ! యింకెవరో అనుకున్నాను. డబ్బు కావాలంటే నీ ఇంటిని తాకట్టు పెట్టాలని చెప్పాను. ఆ కాయితాలు తీసుకువచ్చావా?" అప్పుడే అతన్ని గుర్తు పట్టినట్లు నటిస్తూ గంభీరంగా అన్నాడు రాంలాల్.

చొక్కా జేబులో వున్న రెండు దస్తావేజు కాయితాలు తీసి అతనికి అందించాడు జోసఫ్. షోడాబుడ్డి కళ్ళద్దాలలో నుంచి వాటిని పరిశీలించి చూసి తృప్తి గా తల వూపాడు రాంలాల్.

"లెక్క ప్రకారం నీకు రెండువేలకంటే ఎక్కువ ఇవ్వకూడదు జోసఫూ! ఏదో కూతురిపెళ్ళి అని బ్రతిమాలుతున్నావ్ కాబట్టి మూడువేలు ఇస్తాను. వడ్డీ నూటికి నెలకు పదిహేను రూపాయల పది పైసలు. ఇష్టమేనా?" అన్నాడు తలఎత్తి జోసఫ్ వైపు చూస్తూ.

చమటలు పట్టిన ముఖాన్ని కండువాతో తుడుచుకుంటూ తలవూపాడు జోసఫ్. రాంలాల్ తనను నిలబెట్టి దోచుకుంటున్నాడని అతనికి తెలుస్తూనే వుంది. చేతిని జాచి డబ్బును తీసుకుంటే తను ఈ జన్మలో ఆ బాకీని తీర్చటం జరగదని అతనికి అర్థం అవుతూనే వుంది.

అర్థం అయినందువల్ల ప్రయోజనం ఏముంది? వయసు వచ్చిన కూతురికి పెళ్ళి చేయకుండా ఎంత కాలమని యింట్లో అట్టి పెట్టుకుంటాడు?

అతనిమీద జాలితో ఆ డబ్బును దానం చేసినట్లు ఫోజు పెట్టి తాకట్టు కాగితాలమీద సంతకాలు పెట్టించాడు రాంలాల్. ఇనుపపెట్టెను తెరిచి మూడువేల రూపాయల్ని అతనికి అందించాడు.

వణుకుతున్న చేతులతో ఆ డబ్బును అందుకుని జేబులో పెట్టుకున్నాడు జోసఫ్. రాంలాల్‌కి, అతని కొడుక్కి నమస్కారం చేసి గబగబా దుకాణం బయటికి వెళ్ళిపోయాడు.

"జాగ్రత్త జోసఫూ! అసలే రోజులు బాగాలేవు. డబ్బు జాగ్రత్త!!" పెద్దగా అరిచి అతన్ని హెచ్చరించాడు రాంలాల్. అతను వీధి చివరికి పోయేదాకా ఆగి ప్రక్కనే వున్న టెలిఫోన్‌ని అందుకున్నాడు.

ఒక నెంబర్ని డయల్ చేయగానే కనెక్షన్ వచ్చింది.

"హల్లో! ఎవరు మాట్లాడుతున్నది?" ఖంగుమంటూ పలికింది ఒక కరకుకంఠం.

"నేను రాంలాల్‌ని మాట్లాడుతున్నాను. నిన్న మీకు చెప్పిన జోసఫ్ ఇప్పుడే వచ్చి డబ్బు తీసుకుపోయాడు. నీలంరంగు చొక్కా, చారల తుండుగుడ్డ భుజంమీద వేసుకొని వున్నాడు. జాగ్రత్తగా గమనించుకోండి" అంటూ చిన్నగా నవ్వి ఫోన్ పెట్టేశాడు రాంలాల్.

విప్పారిన నేత్రాలతో అతని చర్యలను పరికిస్తున్న అతని కొడుక్కు తల గిర్రున తిరిగినట్లయింది ఆ మాటలు వినగానే. డబ్బును సంపాదించేది డబ్బే అని తండ్రి అన్న మాటలకు అర్థం అప్పుడు తెలిసివచ్చింది అతనికి.

## 2

మసక చీకట్లు ముసురుకుంటున్న సమయంలో భగల్‌పూర్ సెంటర్ని దాటి రైల్వేగేటు దగ్గిరికి వచ్చాడు జోసఫ్.

మూసివుంది ఆ గేటు. కార్లు, లారీలు, రిక్షాలు అన్నీ ఒకదాని వెనుక ఒకటిగా వరసల్లో నిలబడి వున్నాయి రోడ్డుమీద.

జేబులోవున్న డబ్బును తడిమి చూసుకుంటూ, రోడ్ ప్రక్కనేవున్న ఒక టెలీఫోన్ స్తంభం దగ్గర నిలబడ్డాడు జోసఫ్. ఇంటికి పోయి డబ్బు దొరికిందని తన భార్యకు, కూతురికి చెప్పి, వాళ్ళ ముఖాల్లో చిందులేసే ఆనంద తరంగాల్ని చూడాలన్న ఆత్రుత కుదురుగా నిలవనీయటం లేదు అతన్ని. ఆ మరునాటినుంచి ప్రారంభించవలసిన పెళ్ళి పనులను గురించిన ఆలోచనలు వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి అతని మనస్సును.

సరిగ్గా అదే సమయంలో అతని ముందు ప్రత్యక్షమయ్యారు ఇద్దరు దృఢకాయులు.

"జేబులో వున్న డబ్బును మర్యాదగా యిచ్చేయ్. అరిచి అల్లరిచేయటానికి ప్రయత్నిస్తే ప్రాణాలు పోతాయి" తళతళలాడుతున్న చాకు నొకదాన్ని అతని గుండెలకు ఆనిస్తూ క్రూరంగా అన్నాడు వారిలో ఒకతను.

ఉలిక్కిపడి తన ఆలోచనల్లోనుంచి బయటికి వచ్చాడు జోసఫ్. తనచెవుల్ని తనే నమ్మలేక విచిత్రంగా చూశాడు వారివంక.

"డబ్బు ఇవ్వమంటే అలా గుడ్లు మిటకరిస్తావేమిటి బే? తీయ్ జేబులోనుంచి" అంటూ అతని చొక్కా పట్టుకొని రఫ్‌గా ముందుకు లాగాడు రెండో దృఢకాయుడు.

జోసఫ్ కనులముందు మెదులుతున్న పంచరంగుల కలలన్నీ క్షణంలో మటుమాయం అయిపోయాయి.

"దొంగలు... దొంగలు" అని అరుస్తూ రోడ్ మీదికి పరుగెత్తటానికి ప్రయత్నించాడు. చటుక్కున అతని కాలికి తన కాలు అడ్డంపెట్టి క్రింద పడవేశాడు మొదటి దృఢకాయుడు.

"రక్షించండి... ఈ దొంగల బారినుంచి నన్ను రక్షించండి." గిలగిలా కొట్టుకుంటూ గొంతు చించుకొని అరిచాడు జోసఫ్.

అప్పుడే రైలుపట్టాలను దడదడలాడిస్తూ గేటుదగ్గిరికి వచ్చింది ఢిల్లీ ఎక్స్‌ప్రెస్. జోసఫ్ అరిచిన అరుపులు దాని శబ్దంలో కలిసిపోయాయి. అందరి చూపులూ ఆ ట్రైన్ మీద వుండటంతో టెలిఫోన్ స్తంభం దగ్గిర జరుగుతున్న దారుణం ఎవరికీ అగుపించలేదు.

క్రిందవున్న పెద్ద బండరాయిని ఎత్తి జోసఫ్ తలమీద బలంగా బాదాడు ఒక దృఢకాయుడు. జేబులో చేయిపెట్టి రాంలాల్ యిచ్చిన నోట్లను స్వాధీనపరుచుకున్నా డు అతని సహచరుడు.

"డబ్బు... నా డబ్బు... నా డబ్బు..." పిచ్చిగా అరుస్తూ వారి చేతుల్ని విదిలించికొట్టి లేచి నిలబడ్డాడు జోసఫ్.

లాగిపెట్టి అతని గడ్డంమీద గుద్దారు వారిద్దరూ. గుద్దిన వెంటనే వెనుతిరిగి రోడ్ మీద నిలబడివున్న వాహనాల మధ్యకు పరుగు తీశారు.

దూరంగా వెళ్ళిపోయింది ఢిల్లీ ఎక్స్‌ప్రెస్. వెంటనే తెరుచుకున్నా యి రై ల్వేగేట్లు. చెవులు చిల్లులు పడేటట్లు హారన్స్ మ్రోగిస్తూ ముందుకు కదిలాయి రోడ్ మీద వున్న వెహికల్స్ అన్నీ.

రక్తం కారుతున్న తలతో, మట్టికొట్టుకున్న దుస్తులతో పిచ్చిగా అరుస్తూ, వాటి మధ్యకు దూరాడు జోసఫ్. అప్పటికే రోడ్‌ను క్రాస్ చేసి ముసురుకుంటున్న చీకట్లలో మాయం అయినారు దృఢకాయులు. వెర్రిచూపులు చూస్తూ తనదారికి అడ్డం వచ్చిన జోసఫ్‌ని విసురుగా రోడ్ క్రిందికి నెట్టాడు ఒక రిక్షావాలా.

"అయ్యో నా డబ్బు పోయింది! నా కూతురి పెళ్ళికోసం ఇంటిని తాకట్టు పెట్టి తెచ్చుకున్న డబ్బు పోయింది" చేతులు జోడిస్తూ బావురుమన్నా డు జోసఫ్.

"డబ్బు పోతే పోయి పోలీసులకు రిపోర్ట్ చేయవయ్యా. రోడ్‌కు అడ్డంగా నిలబడి గోలచేస్తే తిరిగి వస్తుందా?" అంటూ అతన్ని నిర్దాక్షిణ్యంగా మరోసారి నెట్టి తన దారిన తను వెళ్ళిపోయాడు రిక్షావాలా.

పోతున్న ప్రాణాలు లేచివచ్చినట్లు అయింది ఆ మాటల్ని విన్న జోసఫ్‌కి. వేగంగా కదులుతున్న వాహనాల మధ్య నుంచి పరుగులు తీసి, భగల్‌పూర్ సెంటర్లో వున్న పోలీస్‌స్టేషన్‌ని సమీపించాడు.

ఎప్పుడూ నిశ్శబ్దంగా నిర్మానుష్యంగా కనిపించే ఆ ప్రదేశం, వచ్చేపోయే పోలీసులతో విపరీతమైన రద్దీగా వుంది ఆరోజు. పడుతూ లేస్తూ పరుగెత్తుకు వచ్చిన జోసఫ్‌ని గురించి పట్టించుకోలేదు అక్కడి వారెవరూ.

"అయ్యా! ఇద్దరు దుర్మార్గులు నడిరోడ్ మీద నన్ను దోచుకున్నారు"స్టేషన్ ముందు నిలబడివున్న ఓ ఇన్‌స్పెక్టర్ దగ్గిరికి పోయి గద్గదంగా అన్నాడు జోసఫ్.

"రిపోర్ట్ రాసివ్వు... పోయి రైటర్ని చూడు" అంటూ అవతలికి వెళ్ళిపోయాడు ఆ ఇన్‌స్పెక్టర్.

తన గోడును విన్న వెంటనే ఏదో ఒకటి చేసి ఆ దొంగల్ని పట్టుకుంటారన్న ఆశతో అక్కడికి వచ్చాడు జోసఫ్. ఇన్‌స్పెక్టర్ మాటలతో సగం చచ్చిపోయింది అతని ఆశ.

అదే సమయంలో మ్రోతలు చేస్తూ అక్కడికి వచ్చింది ఒక పోలీస్ జీప్. ఠీవిగా ముందుసీటులోనుంచి క్రిందికి దిగి చుట్టూ చూశాడు పోలీస్ కమీషనర్ బహదూర్ సింగ్. అతన్ని చూడగానే చలనం వచ్చింది జోసఫ్‌లో.

పేదలన్నా, పేదల బాధలన్నా విపరీతమైన సానుభూతి చూపిస్తాడట ఆ బహదూర్ సింగ్! తనకు చేతనయినంత సహాయం వెంటనే చేస్తాడట!!

రక్తసిక్తమైన దుస్తులతో శోకమూర్తిలా తనముందుకు వచ్చిన జోసఫ్‌ని సాదరంగానే పలుకరించాడు బహదూర్ సింగ్. సానుభూతితో విన్నాడు అతను చెప్పిన విషయాల్ని.

"చూడు జోసఫ్! ఇంకో రెండు రోజులదాకా వూపిరి పీల్చుకునే వ్యవధికూడా మా డిపార్ట్‌మెంట్‌కి ఉండదు. రెండు రోజులు గడిచిన తర్వాత నా ఆఫీసుకు రా. ఏదో ఒకటి చేయటానికి ప్రయత్నిస్తాను" అంటూ అతని భుజం తట్టి స్టేషన్ లోపలికి వెళ్ళిపోయాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=690**

*   *   *

**Read other books of Mr. Madhubabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=20**